భూసేకరణపై రైతులకు అపోహలు వద్దు

- కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణపై రైతులతో సమావేశం

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 9 : గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణపై రైతులు ఎలాంటి అపోహలు చెందవద్దని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణపై టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల రైతులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు అన్యాయం జరుగకుండా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇదివరకే ఆదేశం చారని తెలిపారు. రైతుల అభీష్టం మేరకే భూసేకరణ చేస్తామన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ద్వారా 13గ్రామాల రైతులు భూములను కోల్పోతున్నారని అన్నారు. 350ఎకరాలు 35కిలోమీటర్ల దూరంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే వస్తుందన్నారు. రోడ్డు నిర్మాణం కోసం 45మీటర్ల వెడల్పు మాత్రమే సేకరిస్తున్నామని, కొన్ని చోట్ల పార్కింగ్, తదితర అవసరాల కోసం 170నుంచి 250మీటర్ల వెడల్పులో కొందరు రైతులు భూములు కోల్పోతున్నారని తెలిపారు. నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి ప్రభుత్వ భూములు ఎక్కువ ఉన్న చోటుకు వాటిని మార్చి తక్కువ మొత్తంలో భూములు సేకరించే విధంగా చర్యలు తీసుకునేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రైతులకు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల పంచమి వేడుకలు

భూపాలపల్లిలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

గణపురం/మహదేవపూర్, ఆగస్టు 9 : భూపాలపల్లి జిల్లాలో నాగుల పంచమి వేడుకలు శుక్రవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. కాకతీయుల కళాక్షేత్రం కోటగుళ్లలో శ్రావణ శుక్రవారం పర్వదినం తోపాటు నాగుల పంచమి సందర్భంగా అర్చకులు నాగరాజు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నాగేంద్రస్వామి పుట్ట వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. కోటగుళ్లలో గణపురం ఎస్సై రేఖాఅశోక్, మమత దంపతులు స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. జిల్లా కేంద్రంలోని పైలేట్‌కాలనీలో గల పుట్టలో, శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయంలోని పుట్టల వద్ద భక్తులు పూజలు చేశారు. శ్రావణ మొదటి శుక్రవారం కావడంతో భక్తులు జిల్లా కేంద్రంలోని శివాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో పూజలు చేశారు. మహదేవపూర్ మండల కేంద్రంతోపాటు మండంలోని గ్రామాల్లో నాగుల పంచమి, శ్రావణ పర్వదిన వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నాగేంద్రగిరి అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో ఉన్న నాగదేవతకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి పుట్టలో పాలు పోశారు. శ్రావణ శుక్రవారం నేపథ్యంలో మందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

గంజాయి సరఫరా చేస్తున్న నలుగురి అరెస్ట్

కాటారం, ఆగస్టు 9 : నిషేధిత గంజాయిని విక్రయించడానికి తెచ్చిన నలుగురు యువకులను కాటారంలో శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. కొంత మంది యువకులు గంజాయి సరఫరా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి చింతకాని క్రాస్ వద్ద మాటువేయగా నలుగురు యువకులు అనుమానస్పదంగా కనిపించారు. ఓ యువకుడు బైక్‌పై వచ్చి మరో ముగ్గురికి గంజాయి ఇస్తుండగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. తనిఖీ చేయగా 1.4కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. విచారణలో పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన బొంతల రమేశ్ బైక్‌పై చింతకాని క్రాస్ వద్దకు వచ్చి అక్కడే మరో బైక్‌పై ఉన్న భూపాలపల్లికి చెందిన సాదు వినయ్, మల్హార్ మండలం కొయ్యూర్‌కు చెందిన లకావత్ రాహుల్, కాటారానికి చెందిన జాడి గణేశ్‌కు ఇస్తున్నట్లు ఒప్పుకున్నారు. గంజాయి ఎక్కడి నుంచి వచ్చిందని ఆరా తీయగా మహారాష్ట్రలోని గుర్తు తెలియని వ్యక్తి వద్ద రూ.28 వేలు ఇచ్చి 1.4 కిలోల గంజాయిని కొన్నట్లు బొంతల రమేశవ తెలిపాడన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు. ముఠాను చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుళ్లు హరి కుమార్, జంపన్న, సాంబశివరావు, శ్రీనివాస్, రఘు, లవన్, లక్ష్మిరాజ్, హోంగార్డు తిరుపతిని ఎస్సై, అధికారులు అభినందించారు.

గుర్తుతెలియని యాచకుడి మృతి

మంగపేట, ఆగస్టు 9 : చుంచుపల్లి సమీపంలో యాచకుడు మృతిచెందినట్లు ఎస్సై టీవీఆర్ సూరి శుక్రవారం తెలిపారు. మృతుడు నీలం రంగు ప్యాంటు, క్రీం కలర్ చొక్కా ధరించి, సుమారుగా 45ఏళ్ల వయసు ఉంటుందన్నారు. చుంచుపల్లి వద్ద కొంతకాలంగా భిక్షాటన చేస్తూ ఉండేవాడని స్థానికులు ద్వారా తెలిసిందన్నారు. ఆచూకీ తెలిసిన వారు 8712670092, 8712670093 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, **MUBIN SULTANA** W/o **Md Khaja Shamsuddin** R/o H.No. 2-7-848, Alipura, Subedari, Hanamkonda, Hanumakonda Dist., T.S. In my Passport my Spouse Name has been wrongly mentioned as **MOHAMMED KHAJA SHAMSHUDDIN GULRAIZ** instead of **MD KHAJA SHAMSUDDIN.**

NTW-000

CHANGE OF NAME

I, **KONDAVEETI DHANRAJ** S/o **KONDAVEETI BARTHALOMAIAH** R/o H.No. 5-161/1, Vanchanagiri Village of Geesugonda Mandal, Warangal District, T.S. In my Passport my Name has been wrongly mentioned as **KONDAVEETI DHANARAJ** instead of **KONDAVEETI DHANRAJ.**

FOR SALE

★Shop in Auto Nagar 45 Lakhs (Rs. 9000/- Getting Rent), House in Kasibugga 45 Lakhs (Rs. 6,200/- Getting Rent). Cont: 9492199961.

NTW-314865

డాక్యుమెంట్స్ పోయినది

పత్తి సాయికిరణ్ దస్తావేజు నెం. 6696/2022 ద్వారా పాశం శశిరేఖ గారి నుండి ఖరీదు చేసినటువంటి దాని యొక్క లింక్ డాక్యుమెంట్ నెం. 4411/2013, తేది. 22-5-2013 జనగామ నుండి ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్యలో జిరాక్స్ సెంటర్‌లో జిరాక్స్ తీసుకొన్న తర్వాత పోయినది. ఎంత వెతికినా దొరకలేదు. దయచేసి దొరికినవారు వెంటనే సంప్రదించగలరు.
Call: 6303368170

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

- ములుగు, జయశంకర్ జిల్లాల్లో వేడుకలు
- ర్యాలీలు చేపట్టిన ఆదివాసీలు
- హాజరైన అధికారులు, ఉద్యోగ సంఘాలు, ప్రజా ప్రతినిధులు
- కుమ్రంభీంకు ఘన నివాళులు

ములుగులో జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ దివాకర, ఆదివాసీ సంఘాల నాయకులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఆగస్టు 9 : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆదివాసీ, ఉద్యోగ, విద్యార్థి సంఘాలు ర్యాలీలు చేపట్టాయి. పలు మండలాల్లో కుమ్రంభీం విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. పలువురు ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ ఎస్టీ వర్గీకరణ తప్పదని, మద్దతు తెలిపిన రాజకీయ పార్టీలకే భవిష్యత్తు ఉంటుదన్నారు. ఉద్యోగ, ఉపాధి, పోడు భూములు, ప్రమోషన్లలో ఎస్టీ జాబితాలో ఉన్న ఇతర మైదాన ప్రాంత వర్గాల వారు ముందుకు వెళ్తుంటే అడవిని నమ్ముకున్న ఆదివాసీలు మాత్రం వెనుక బడిపోవడం బాధకరమన్నారు. ములుగులో డీఎల్ఆర్ గార్డెన్ నుంచి గిరిజన భవన్ వరకు నిర్వహించిన ర్యాలీలో డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మంకిడి రవి, ప్రధాన కార్యదర్శి రవి కాంత్, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు వజ్జ రాజు పాల్గొన్నారు. మంగపేటలో నిర్వహించిన కార్యక్రమానికి తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్‌కుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు డబ్బుల ముత్యాలరావు, ఆగబోయిన చంద్రకాంత్, జిల్లా బాధ్యులు పొదెం నాగేష్, ఆగబోయిన సాయికుమార్, ఏసీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పొదెం రవీందర్, ఏఈడబ్ల్యూసీఏ మండల అధ్యక్షుడు చింత కృష్ణమూర్తి హాజరయ్యారు. తాడ్వాయి మండలం మేడారం ఆదివాసీ మ్యూజియంలో కమ్రంభీం, బిర్సా ముండా చిత్రపటాలకు యూత్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోవిందరావుపేట మండలం పస్రాలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి చింత కృష్ణ, కార్యదర్శి మడి సాయిబాబ, సీఐ రవీందర్ హాజరై జెండాను ఆవిష్కరించారు. వెంకటాపురం (నూగూరు) మండల తహసీల్‌లో ఆదివాసీ జెండాను ఆవిష్కరించి భారీ ర్యాలీ తీశారు. మహదేవపూర్ మండలం జరిగిన కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఏటీడీఏ దేశిరాం నాయక్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డీటీ కృష్ణ, జీసీసీ మేనేజర్ హరి లాల్, ఆదివాసీ జాక్ జిల్లా అధ్యక్షుడు గుర్సింగ బాపు, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు మడె కుమార్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు బీ.సురేశ్ పాల్గొన్నారు. మల్హార్ మండలం కొయ్యూరులో నిర్వహించిన కార్యక్రమానికి తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి రమేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం లచ్చయ్య, జిల్లా అధ్యక్షులు గొట్టం భూమయ్య, డివిజన్ ఉపాధ్యక్షుడు గుంటి నాగరాజు, మండల అధ్యక్షులు గుంటి బాపు హాజరయ్యారు. కాటారం మండలకేంద్రంలోని అయ్యప్ప కల్యాణ మండపం నుంచి ప్రధాన కూడలి వరకు డప్పుచప్పుళ్లు, సాంస్కృతిక ప్రదర్శనల మధ్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో దేశిరాం నాయక్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్, నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకరి మల్లేశ్ పాల్గొన్నారు. మహాముత్తారం మండలం యామన్‌పల్లి గ్రామ ప్రధాన కూడలిలోని కుమ్రంభీం విగ్రహానికి ఆదివాసీలు నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, పీసీసీ సభ్యుడు బెల్లంకొండ కిష్టయ్య, నాయకపోడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఒల్లాల మల్లేశ్, ఎస్టీ హాస్టల్ వార్డెన్ వేముల శంకరయ్య, నాయకపోడ్ సేవా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కండెల రామచంద్రం, మండల అధ్యక్షుడు రాంనేని వెంకట్రాజం, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు గుర్సింగ మహేష్, రాష్ట్ర మహిళా నాయకురాలు కండెల మల్లక్క పాల్గొన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం, కోయ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. నాయక పోడు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ముంజం సారయ్య ఆదివాసి గిరిజన జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు బద్ది సమ్మయ్య, జిల్లా నాయకులు గుంటి పోశయ్య, బొడ్డు సమ్మయ్య, గొగ్గేలా శ్రీను, కల్నేని సాంబయ్య, మేకల తిరుపతి, గంప వెంకటేష్, గంట శేఖర్ పాల్గొన్నారు.


మహాముత్తారం : కుమ్రంభీం విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

తాడ్వాయి : మేడారంలోని గిరిజన మ్యూజియం వద్ద నినాదాలు చేస్తున్న ఆదివాసీలు

కృష్ణకాలనీ: ఆదివాసీ జెండాను ఎగురవేస్తున్న నాగపూర్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు సారయ్య

కాటారం : ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

'సామాజిక సేవ అభినందనీయం'

భోజనాలు వడ్డిస్తున్న హరీశ్‌రెడ్డి

కృష్ణ కాలనీ, ఆగస్టు 9 : భూపాలపల్లి జిల్లాలో సామాజిక సేవలు అందిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని భూపాలపల్లి మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి అన్నారు. జిల్లా ప్రధాన ఆస్పత్రిలో జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి రోజు రోగులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని వైస్‌చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించి, రోగులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ 27వ వార్డు అధ్యక్షుడు కవ్వంపల్లి శేఖర్, నాయకులు మల్లేశ యాదవ్, ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి

ములుగు ఓఎస్డీ మహేష్ బాబా సాహెబ్ గీతే

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఓఎస్డీ

ములుగురూరల్, ఆగస్టు 9 : యువత సన్మార్గంలో నడిచి తల్లిదండ్రులు, గురువులు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని ములుగు ఓఎస్డీ మహేష్ బాబా సాహెబ్ గీతే అన్నారు. యువతకు శుక్రవారం మండలంలోని బండారుపల్లి టీజీపీఎస్ గురుకుల పాఠశాల ఆవరణలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా ఓఎస్డీ హాజరై ప్రారంభించారు. యువతతో కలిసి డ్రగ్స్ నిర్మూలన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడా పోటీల్లో యువత రాణించి జిల్లా స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఎస్సైలు సీహెచ్ వెంకటేశ్వర్‌రావు, రామకృష్ణ పాల్గొన్నారు.

గొత్తికోయల సంక్షేమంలో ముందుంటాం

గోవిందరావుపేట, ఆగస్టు 9 : గొత్తికోయల సంక్షేమంలో పోలీస్ శాఖ ఎల్లవేళలా ముందుంటుందని ములుగు ఓఎస్డీ మహేష్ బాబాసాహెబ్ గీతే అన్నారు. సీఆర్పీఎఫ్ 58 బెటాలియన్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం పస్రా సీఐ రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఓఎస్డీ హాజరై మాట్లాడారు. అనంతరం వారికి కుట్టు మిషన్లు, సైకిళ్లు, వాటర్ ట్యాంకులు, యువతకు క్రీడా సామగ్రి అందజేశారు. ములుగు డీఎస్పీ రవీందర్, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కే ప్రసాద్, పస్రా ఎస్సై కములాకర్ పాల్గొన్నారు.

దివ్యాంగుల స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కుమార్‌స్వామిగౌడ్

కుమారస్వామి

కృష్ణకాలనీ, ఆగస్టు 9 : పారా (దివ్యాంగుల) స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుర్రంపేట గ్రామానికి చెందిన కొయ్యడ కుమారస్వామి గౌడ్‌ను నియమిస్తూ దివ్యాంగుల స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సింగారపు బాబు, ప్రధాన కార్యదర్శి గడిపెల్లి ప్రశాంత్‌లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కుమారస్వామిగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాబు, ప్రశాంత్‌లతో పాటు క్రమశిక్షణ కమిటీ సభ్యులు సంజీవయ్య, మహేశ్, నరేశ్‌యాదవ్, రఘులకు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం మత్తులో అటెండర్ ఆత్మహత్య

రియాజ్ (ఫైల్)

చిట్యాల, ఆగస్టు 9 : మద్యం మత్తులో అటెండర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. తిరుమలాపూర్ గ్రామానికి చెందిన షేక్ రియాజ్ పాషా (30) చల్లగరిగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. మూడేళ్లుగా మద్యానికి బానిసై కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కాగా, ఈనెల 7న బుధవారం రాత్రి కడుపు నొప్పి రాగా తల్లి భాను బేగం ఆర్ఎంపీ దగ్గరికి వెళ్దామని చెప్పినా వినలేదు. మరుసటి రోజు గురువారం ఉదయం నొప్పి రావడంతో భరించలేక మద్యం మత్తులో ఇంట్లోని గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తల్లి గ్రామానికి చెందిన జంగంపల్లి పవన్ బైక్‌పై చిట్యాల దవాఖానకు తీసుకెళ్లింది. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అదే రోజు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. రియాజ్ అంత్యక్రియల కోసం కాంప్లెక్స్ హెచ్ఎం ఝాన్సీరాణి ఆదేశాల మేరకు పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ రూ.20వేలు అందజేశారు.

న్యాయవాదులపై దాడి.. ప్రజాస్వామ్యంపై దాడే

కృష్ణకాలనీ, ఆగస్టు 9 : న్యాయవాదులపై దాడి చేస్తే, ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్లేనని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సురేశ్‌కుమార్ అన్నారు. న్యాయవాద దంపతులపై జనగామ పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ రెండో రోజు శుక్రవారం న్యాయవాదులు ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకూ న్యాయవాదులపై పోలీసుల దాడులు మితిమీరిపోతున్నాయన్నారు. దాడికి పాల్పడిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్, న్యాయవాదులు కీరవాణి, చిరంజీవి, సంగెం రవీందర్, ఈవేశాల అనిల్, రత్నం కిరణ్, ప్రశాంత్, శ్రీనివాసచారి, వేషాల రవీందర్, మంగళపల్లి రాజ్‌కుమార్, రజనీకాంత్ పాల్గొన్నారు.

బిల్ట్ కార్మికులకు వెంటే ఉంటాం

మంగపేట, ఆగస్టు 9 : ఏళ్ల తరబడి బిల్ట్ ఫ్యాక్టరీలో పని చేసి, చివరకు వేతన సెటిల్‌మెంట్ ప్రక్రియలో మోసపోయిన బిల్ట్ కార్మికలకు అండగా ఉంటామని నవసంఘ రక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు పంజాల జైహింద్‌గౌడ్ అన్నారు. మండలంలోని కమలాపురంలో శుక్రవారం బిల్ట్ కార్మికుల సమస్యలపై నిర్వహించిన చర్చా వేదిక కార్యక్రమానికి ఆయనతో పాటు, సమితీ నాయకులు బోయినపల్లి లింగస్వామి, రామన్నగౌడ్, వెంకటేశం, కిషన్‌నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు మనోధైర్యం కోల్పోవద్దని, అండగా ఉంటామని తెలిపారు. పరిశ్రమ నిలిచిపోవడం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 18 వేల కుటుంబాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోవడం బాధాకరమన్నారు. బాధిత కార్మికులు ఐక్యంగా ఉండి మరో పోరాటానికైనా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వాలు సహకరించకపోతే ఆదాయ వనరులైన బొగ్గు, ఇసుక లారీలను అడ్డుకునేందుకు వెనుకాడేది లేదన్నారు. చర్చావేదికలో పలువురు సీనియర్ కార్మికులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'ఏజెన్సీ భూములపై సివిల్ కోర్టులకు అధికారాలు ఉండవు'

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 9 : ఏజన్సీలుగా నోటిఫై అయిన ఏరియాల్లోని భూములపై సివిల్ కోర్టులకు ఎటువంటి అధికారాలు ఉండవని, సర్వాధికారాలు ఐటీడీఏలకు మాత్రమే ఉంటాయని సీనియర్ సివిల్ జడ్జి కే జయరాంరెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని భూపాలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ భవిష్యత్తు తరాలకు అందించాలని సూచించారు. అనంతరం జడ్జి కుమ్రంభీం చిత్ర పటానికి పూల వేసి నివాళులర్పించారు. వ్యాసరచన, ఉపన్యాసం, పాటలు, డాన్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఈసంపల్లి రాజారత్నం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మహేందర్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెరుగు రవీందర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జీ ప్రియాంక పాల్గొన్నారు.

''స్వచ్ఛదనం-పచ్చదనం'' నిరంతరం జరగాలి

ఎమ్మెల్యే జీఎస్ఆర్‌తో కలిసి మొక్కలు నాటిన కలెక్టర్ రాహుల్ శర్మ

19వ వార్డులో మొక్క నాటుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే జీఎస్ఆర్

కృష్ణ కాలనీ, ఆగస్టు 9 : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ''స్వచ్ఛదనం-పచ్చదనం'' కార్యక్రమం నిరంతరం జరగాలని కలెక్టర్ రాహుల్‌శర్మ మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 18, 19 వార్డుల్లైన ఎల్‌బీనగర్, గాంధీనగర్ కాలనీలో గల ప్రధాన కూడళ్లలో కలెక్టర్ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఇండ్ల పరిసరాలు, గ్రామాలు, మున్సిపాలిటీలోని ప్రతి ఇంట్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను రక్షించాలి..

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు మొక్కలు నాటి వాటిని రక్షించాలని మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీసిద్ధూ అన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం లో భాగంగా 6వ వార్డు కృష్ణకాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడారు. 6వ వార్డు కౌన్సిలర్ ఎడ్ల మౌనికాశ్రీనివాస్, అంగన్‌వాడీ, మెప్మా, మున్సిపల్ సిబ్బందితోపాటు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేయాలి

ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే జీఎస్సార్

గణపురం : నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్. సభ్యులు సమన్వయంతో రైతుల సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం గణపురం మండల కేంద్రం శివారు కొత్తపల్లిలోని గణపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో భూపాలపల్లి నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, వైస్‌చైర్మన్ రేపాక రాజేందర్, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. ముందుగా మార్కెట్ ప్రాంగణంలో స్థానిక ఎంపీడీవో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వనమహోత్సవంలో పాల్గొని ఎమ్మెల్యే మొక్కలు నాటి, నీరు పోశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. గణపుర